

విశాఖకే తలమానికంగా ఏయూ

ఏయూ అఖిల భారతస్థాయిలో 9వ ర్యాంక్ సాధించడంపై మేయర్ హరివెంకట కుమారి సంతోషం వ్యక్తం చేశారు. 8లో



నూతన వేతనాల కోసం..

నూతన వేతనాల కోసం స్టీల్‌ప్లాంట్ కార్మికులు చేపట్టిన అడ్మిన్ బిల్డింగ్ ముట్టడి స్వల్ప ఉద్రిక్తతకు దారి తీసింది. 8లో



డెంగ్యూపై అవగాహన ర్యాలీ

జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ జరిగింది. 8లో

న్యూస్‌రీల్

స్మార్ట్ సిటీ పనులపై జీవీఎంసీ కమిషనర్ సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ

అల్లిపురం : స్మార్ట్ సిటీ పనుల పురోగతిపై జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ అధికారులతో మంగళవారం సమీక్షించారు. నగరంలో ఇప్పటివరకు చేపడుతున్న స్మార్ట్ సిటీ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. నగరంలో ప్రధాన ప్రాజెక్టులతో పాటు రోడ్లు, ప్రధాన జంక్షన్లు ఏ విధంగా అభివృద్ధి చేయవచ్చో అధికారులను అడిగి తెలుసుకున్నారు. పార్కింగ్ స్థలాలు, ఫుడ్ కోర్టులు ప్రజలకు అనుకూలంగా ఉండే విధంగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రోడ్లు, ఫుట్‌పాత్‌ల పనులు ప్రజలకు ఇబ్బంది కలగకుండా చేయాలని సూచించారు. స్మార్ట్ సిటీ పనులు ఏ విధంగా చేయాలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో జీవీఎంసీ ప్రధాన ఇంజినీరు రవికృష్ణ రాజు, ప్రణాళిక అధికారి బి.సురేష్‌కుమార్, పర్యవేక్షక ఇంజినీర్లు రవి, గోవిందరాజు, డీడీహెచ్ దామోదరరావు, కార్యనిర్వాహక ఇంజినీర్లు, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్లు, స్మార్ట్ సిటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

20న గురుకుల విద్యాలయాల ప్రవేశ పరీక్ష

భీమునిపట్నం: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో గురుకుల పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాల్లో 2034–24 సంవత్సరానికిగాను ప్రవేశానికి ఈనెల 20 తేదీన ప్రవేశ పరీక్ష జరుగుతుందని జిల్లా కో ఆర్డినేటర్, గురుకుల ప్రిన్సిపాల్ కోడి రాంబాబు మంగళవారం తెలిపారు. ఆరోజు ఉదయం 10 గంటల నుంచి 12గంటల వరకు 5, 6, 7, 8 తరగతుల విద్యార్థులకు పరీక్ష జరుగుతుందని, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు జూనియర్, డిగ్రీ కళాశాల్లో ప్రవేశానికి పరీక్ష జరుగుతుందని తెలిపారు. పరీక్షకు హాజరయ్యేవారు హాల్ టికెట్లను htpps//aprs.apcfss.in ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందు చేరుకోవాలని కోరారు.

జగనన్న విదేశీ విద్యా దీవెనకు దరఖాస్తుల ఆహ్వానం



ఎంవీపీకాలనీ: జగనన్న విదేశీ విద్యాదీవెనకు అర్హులైన విద్యార్థుల నుంచి ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓబీసీ, కాపు విద్యార్థులు ఈ పథకానికి అర్హులు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.8 లక్షలలోపు ఉండాలి. వీరికి పీజీ, పీహెచ్‌డీ, ఎంబీబీఎస్ చదివేందుకు ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటు అందిస్తుంది. అంతర్జాతీయంగా టాప్ 50 విద్యా సంస్థల్లో విద్యనభ్యసించే వెసులుబాటు ఉంది. క్వాలిఫైయింగ్ కోర్సుల్లో 60శాతం మార్కులు, తత్సమాన గ్రేడ్ ఉన్న విద్యార్థులు ఈపథకానికి అర్హులు. ఎంబీబీఎస్ కోర్సుల్లో చేరాలనుకొనే ఇంటర్మీడియేట్ విద్యార్థులు నీట్ పరీక్షలో అర్హత సాధించాల్సివుంటుంది. అర్హులైన విద్యార్థులు https://jnanabhumi.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సివుంటుంది.

21 నుంచి ఉచిత యోగా శిక్షణ తరగతులు

ఏయూక్యాంపస్: రుషి గాయిత్రి యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 21నుంచి ఉచిత యోగ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు కేంద్రం నిర్వాహకులు తెలిపారు. 12 రోజుల పాటు ఈ ప్రత్యేక శిబిరం నిర్వహిస్తామని, సాయంత్రం 6 గంటలకు యోగా శిక్షణ ప్రారంభం అవుతుందన్నారు. ఆసక్తి కలిగినవారు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పూర్తి వివరాలకు 9440395439, 7780154103 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

20న ఐటీఐలో క్యాంపస్ డ్రైవ్

కంచరపాలెం: ప్రభుత్వ పాత ఐటీఐలో సెనాజియల్ కాస్టింగ్ లిమిటెడ్ కంపెనీ విశాఖ శాఖలో పనిచేసేందుకు ఐటీఐ, డిప్లమో కోర్స్ పూర్తి చేసిన అభ్యర్థులకు ఈ నెల 20న క్యాంపస్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పాత ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ తెలిపారు. ఐటీఐ ఫిట్టర్, మెషినిస్ట్, టర్నర్, ఎంఎంటీఎం, వెల్డర్, డీజిల్ మెకానిక్, ఎంఎంవీ, డిప్లొమో మెకానికల్, మెటలార్జి కోర్స్‌ల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి కల్గిన అభ్యర్థులు వారి ధ్రువ పత్రాలతో 20వ తేదీ ఉదయం 10 గంటలకు హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9866088240 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

చదువే ఆస్తి

- మేయర్ గొలగాని హరివెంకట కుమారి
- జీవీఎంసీ పాఠశాలల్లో చదివిన టెన్త్ టాపర్లకు అభినందన
- కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఫలితాలు
- విద్యావ్యవస్థకు ప్రభుత్వం పెద్దపీట
- విద్యార్థులతో కలిసి భోజనం చేసిన మేయర్



టాపర్ మణికంఠకు నగదు ప్రోత్సాహం అందజేస్తున్న మేయర్ హరివెంకట కుమారి. చిత్రంలో డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, సతీష్, ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, డీఈవో సూర్యకళ



టెన్త్‌లో 500 మార్కులు పైబడి సాధించిన విద్యార్థులు



టాపర్లకు స్వీట్లు తినిపిస్తున్న మేయర్ హరి వెంకట కుమారి



సర్టిఫికెట్లతో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులు

దాబాగార్డెన్స్ : చదువే ఆస్తి.. చదువుతోనే బంగారు భవిష్యత్తు లభిస్తుందని మేయర్ గొలగాని హరివెంకట కుమారి అన్నారు. జీవీఎంసీ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడంతో వారిని మేయర్ హరివెంకట కుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు తదితరులు అభినందించారు. మంగళవారం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో అభినందన సభ నిర్వహించారు. 8 జోన్ల పరిధిలోని జీవీఎంసీ పాఠశాలల్లో 500 మార్కులు పైబడి సాధించిన 244 మందికి జ్ఞాపికలు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన (592, 587, 586 మార్కులు) విద్యార్థులకు మేయర్ చేతుల మీదుగా నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి మేయర్ భోజనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మేయర్ హరి వెంకటకుమారి మాట్లాడుతూ జీవీఎంసీ పాఠశాలలో చదివి 592 మార్కులు సాధించడం గొప్ప విషయమన్నారు. 'మీరంతా ఫస్ట్ స్టెప్ ఎక్కారు. ఇక ఇంటర్ అనేది లైఫ్ టర్నింగ్ పాయింట్.. మీ లక్ష్యమంతా చదువుపైనే ఉండాల'న్నారు. టైం టేబుల్ ప్రకారం హార్డ్ వర్క్ చేస్తే లక్ష్యం సాధించవచ్చన్నారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థ మెరుగ్గా ఉండాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో మంచి కార్యక్రమాలు చేపడుతున్నారని చెప్పారు. సీఎం ఆకాంక్షలకు అనుగుణంగా విద్యార్థులు చక్కగా చదువుకోవాలని సూచించారు. నాడు–నేడు కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయన్నారు.

మరిన్ని విజయాలతో ముందుకు సాగాలి

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ ఇంటర్ నుంచి పునాది వేసుకుని మరిన్ని విజయాలతో ముందుకు సాగాలని సూచించారు. డీఈవో చంద్రకళ మాట్లాడుతూ 2023–24 ఏడాదిలో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పెట్టుకున్నామని, అందుకు ఇప్పటి నుంచే ప్రణాళిక వేస్తున్నట్టు తెలిపారు. ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు మాట్లాడుతూ జీవీఎంసీ పాఠశాలల్లో చదివే పిల్లలు 500 పైబడి మార్కులు సాధించడం అమోఘమన్నారు. డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కటుమూరి సతీష్ మాట్లాడుతూ స్కూల్స్ డ్రాప్ అవుట్స్ తగ్గించేందుకు ప్రభుత్వం అమ్మ ఒడి పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ డాక్టర్ వై శ్రీనివాసరావు, డిప్యూటీ ఈవో శ్రీనివాస్, జీవీఎంసీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాగా చదివించారు



గతంలో మౌలిక సదుపాయాలు సరిగ్గా ఉండేవి కావు. అంచలంచెలుగా మా స్కూల్ ఎదిగింది. ఉపాధ్యాయుల కృషి మరువలేనిది. ముఖ్యంగా ఉపాధ్యాయులు బాగా చదివించారు. మంచి ప్రణాళికలు రూపొందించిన మేయర్, జీవీఎంసీ కమిషనర్‌కు కృతజ్ఞతలు.

– పూడి మణికంఠ స్వామి (592 మార్కులు), జీవీఎంసీ స్కూల్, మల్కాపురం

నాడు-నేడుతో పాఠశాలల అభివృద్ధి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నాడు–నేడు కార్యక్రమంలో పాఠశాలలు బాగా అభివృద్ధి చేశారు. ప్రశాంత వాతావరణం కల్పించారు. మంచి మార్కులు వచ్చేలా సహకరించిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు.

– డి.హన్సిత, (587 మార్కులు), జీవీఎంసీ టౌన్ గర్ల్స్ హైస్కూల్, అనకాపల్లి

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవుతా..



బాగా చదివి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలన్నదే లక్ష్యం. మంచి ఉద్యోగం సాధించిన తరువాత పాఠశాలకు సాయం చేస్తా.. ముఖ్యంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు.

– డి.లలిత్‌సాయి (586 మార్కులు), జీవీఎంసీ ప్రకాశరావుపేట హైస్కూల్

ఎండ వాత.. ఉక్కపోత!



నిర్మానుష్యంగా సిరిపురం జంక్షన్



- అదుపు తప్పుతున్న ఉష్ణోగ్రతలు
- అర్ధరాత్రి వేళ 32 డిగ్రీలకు పైనే నమోదు
- ఉదయం నుంచే భగభగలు
- అట్టుడుకుతున్న అల్లూరి, అనకాపల్లి జిల్లాలు
- నేడూ ఇదే పరిస్థితి.. ఆపై కాస్త ఉపశమనం

సాక్షి, విశాఖపట్నం: అగ్ని కార్తెల్లో వాతావరణం అగ్గిని తలపిస్తోంది. ఉమ్మడి విశాఖలో నిప్పులను కురిపిస్తోంది. విశాఖ జిల్లా మినహా అల్లూరి సీతారామరాజు (ఎఎస్సార్), అనకాపల్లి జిల్లాల్లో ఉష్ణోగ్రతలు అదుపు తప్పుతున్నాయి. ఈ రెండు జిల్లాల్లో పలు చోట్ల 40 నుంచి 44 డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయి. ఉష్ణతాపానికి వడగాడ్పులు, తీవ్ర వడగాడ్పులు వీస్తూ జనాన్ని బెంబేలెత్తిస్తున్నాయి. మంగళవారం అత్యధికంగా ఎఎస్సార్ జిల్లా కొండాయగూడెంలో 44.62 డిగ్రీలు, అనకాపల్లి జిల్లా బలిఘట్టంలో 44.55 డిగ్రీల చొప్పున గరిష్ట ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. విశాఖ జిల్లాలో మాత్రం 39 డిగ్రీల లోపే ఉష్ణోగ్రతలు నమోదవుతూ ఒకింత ఉపశమనం కలిగిస్తున్నాయి. మిట్ట మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే సమయానికి ఆకాశం మబ్బులు కమ్ముకోవడంతో ఈ పరిస్థితికి కారణమవుతోంది. అయితే 39 డిగ్రీల లోపు పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నా నగరంలో 52 డిగ్రీల ఉష్ణతాపం అనుభూతి కలుగుతోంది. విశేషమేమిటంటే పగటి (గరిష్ట) ఉష్ణోగ్రతలతో పాటే రాత్రి (కనిష్ట) ఉష్ణోగ్రతలు కూడా పోటీ పడుతున్నాయి. పగలు ఎంతలా ఉష్ణతీవ్రత ఉన్నా రాత్రయ్యే సరికి గరిష్టంగా 26–28 డిగ్రీలకు మించదు. దీనివల్ల వాతావరణం కాస్త చల్లబడి ఉపశమనం కలుగుతుంది. కానీ కొద్ది రోజుల నుంచి అందుకు భిన్నంగా రాత్రి వేళ కూడా 32–33 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు ఎగబాకుతున్నాయి. ఫలితంగా రాత్రి వేళల్లోనూ వేడి వాతావరణంతో ఇళ్లల్లో ఉండలేని పరిస్థితి ఉంటోంది. సాధారణంగా మండు వేసవిలోనైనా ఉదయం 5–6 గంటలకు 28–29 డిగ్రీలతో ఆహ్లాదకర వాతావరణం నెలకొంటుంది. కానీ ఇప్పుడు 33 డిగ్రీలతోనే సూర్యోదయం జరుగుతోంది. అలా పొద్దెక్కే కొద్దీ ఉష్ణతీవ్రత పెరుగుతూ నరకాన్ని తలపిస్తోంది. విశాఖ నగరంలో కొన్నాళ్ల నుంచి ఏ ఇంట్లో చూసినా విరామం లేకుండా ఏసీలు, కూలర్లు ఆన్‌లోనే ఉంటున్నాయి. ఫ్యాన్లు గిరగిరా తిరుతూనే ఉన్నాయి. మరోవైపు వడగాడ్పులు చాలవన్నట్టు ఉక్కపోత కూడా తోడై జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. బుధవారం కూడా ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉష్ణోగ్రతలు దాదాపు ఇలాగే నమోదవుతాయని గురువారం నుంచి కాస్త తగ్గుముఖం పట్టవచ్చని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం అధికారులు 'సాక్షి'కి చెప్పారు. అదే సమయంలో పగలు ఉష్ణతాపం ఉన్నా మధ్యాహ్నం తర్వాత ఆకస్మికంగా ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలకు ఆస్కారం ఉందని తెలిపారు.

జిల్లాలో ఉష్ణోగ్రతలు ఇలా.. (డిగ్రీల్లో)

మండలం	ఉష్ణోగ్రత
విశాఖ ఎయిర్‌పోర్ట్	38.40
ఆనందపురం (కణమాం)	38.07
సింహాచలం	38.0
గాజువాక	38.0
మహారాణిపేట	37.0



2047కు అభివృద్ధి చెందిన దేశంగా భారత్



నియామకపత్రాలు పొందిన అభ్యర్థులతో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి భగవత్ కరాడ్

- ఆ దిశగా ప్రధాని మోదీ ప్రణాళికలు
- దేశంలో పురోగతిలో ఆర్థిక వ్యవస్థ
- రోజ్‌గార్ మేళాలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి భగ్‌వత్ కరాడ్

దొండపర్తి (విశాఖ దక్షిణ): అత్యధిక యువశక్తి కలిగిన భారత్.. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశాల జాబితాలో చేరాలన్న సంకల్పంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అనేక సంస్కరణలకు శ్రీకారం చుడుతున్నారని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి భగ్‌వత్ కిషన్‌రావ్ కరాడ్ పేర్కొన్నారు. వివిధ ప్రభుత్వ రంగ సంస్థలలో ఉద్యోగాలు సాధించిన 388 మంది అభ్యర్థులకు మంగళవారం పోర్టు కళావాణి ఆడిటోరియంలో జరిగిన రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2047కు దేశానికి స్వతంత్ర్యం వచ్చి 100 ఏళ్లు పూర్తవుతుందని, అప్పటికి భారత్ ప్రపంచానికి ఒక దిక్సూచిగా నిలపాలన్న లక్ష్యంతో కేంద్రం ప్రణాళికలు రూపొందిస్తోందని తెలిపారు. ఒకవైపు మాంద్యం కారణంగా అగ్రదేశాలు ప్రధానంగా అమెరికా, చైనాలు సతమతమవుతుంటే.. భారత ఆర్థిక వ్యవస్థ పటిష్టంగానే ఉందని స్పష్టం చేశారు. ప్రధానంగా ద్రవ్యోల్బణం రేటు తక్కువగానే ఉండడం శుభపరిణామమన్నారు. పొరుగు దేశాలైన పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంకలో ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగిన కారణంగా అక్కడ నిత్యావసర ధరలు మండిపోతున్నాయని గుర్తు చేశారు.

యువతకు ఉద్యోగ, ఉపాధి లక్ష్యంగా..

ఒకవైపు ప్రభుత్వ రంగ సంస్థల్లోనే కాకుండా దేశంలో కల్పిస్తున్న మౌలిక వసతులతో ఎంఎస్ఎంఈ, ఇన్‌ఫ్రా రంగాలు గణనీయంగా పుంజుకొని విస్తృత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని భగ్‌వత్ కిషన్‌రావ్ కరాడ్ తెలిపారు. ప్రధానంగా మేకిన్ ఇండియా ద్వారా వైద్య, రక్షణతో పాటు అనేక రంగాల్లో దేశీయ పరిజ్ఞానంతో ఉత్పత్తులను తయారు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విషయంలో అవలంభిస్తున్న నూతన విధానాలతో గత ఆర్థిక సంవత్సరంలో 84.84 బిలియన్ డాలర్లు పెట్టుబడులు వచ్చినట్లు వెల్లడించారు. దీంతో ఆర్థికంగా మరింత బలోపేతమవుతోందన్నారు. అన్ని రంగాల్లో ప్రగతి దిశగా పయనిస్తున్న దేశంలో యువతకు 10 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యంతో రోజ్‌గార్ యోజన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. దీనిలో భాగంగా విశాఖలో 388 మందికి పోస్టల్, రైల్వే, ఎయిమ్స్, ఐఐఎం జీఎస్ఐ వంటి కేంద్ర ప్రభుత్వ రంగం సంస్థల్లో ఉద్యోగాలు కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో తపాలా శాఖ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ వి.రాములు, కస్టమ్స్ చీఫ్ కమిషనర్ సంజయ్, డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి, జీఎస్ఐ డిప్యూటీ డైరెక్టర్ గుప్తా, రైల్వే పోర్టు బీఎస్ఎన్ఎల్, ఐఐఎం అధికారులు పాల్గొన్నారు.

కొత్త ఒరవడితో బోధన సాగాలి

ఆనందపురం : విద్యారంగంలో వస్తున్న కొత్త ఒరవడులను ఉపాధ్యాయులు అవగతం చేసుకొని బోధన సాగించాలని డీఈవో చంద్రకళ చెప్పారు. మండలంలోని పెద్దిపాలెంలో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో 2018 డీఎస్సీ ద్వారా ఎంపికైన స్కూల్ అసిస్టెంట్‌లకు ఐదు రోజులు పాటు వసతితో కూడిన శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి వచ్చిన 146 మంది సోషల్ అసిస్టెంట్‌లకు, 120 మంది హిందీ అసిస్టెంట్‌లకు శిక్షణను అందిస్తున్నారు. ఈ సందర్భంగా డీఈవో చంద్రకళ మాట్లాడుతూ విద్యార్థి అభ్యసనను మెరుగుపరచడానికి శిక్షణ కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అదనపు సమన్వయకర్త బి.శ్రీనివాసరావు, ఎస్సీఆర్‌టీ పరిశీలకుడు కేశిరాజు శ్రీనివాస్, డిప్యూటీ ఎడ్యుకేషన్ అధికారి ఎ.గౌరీశంకర్, డైట్ అధ్యాపకుడు సారిపల్లి త్రినాథరావు, అకడమిక్ మోనటరింగ్ అధికారి డి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చొరవతో సమస్యల పరిష్కారం

- వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి
- ఫార్మాసిటీ నిర్వాసిత మేజర్ సన్స్‌కు పట్టాల పంపిణీ



పట్టాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న స్థానికులు




పట్టాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ తదితరులు

అగనంపూడి (గాజువాక): ఏళ్ల నాటి కల ఫలించింది. గాజువాక మండలం 85వ వార్డులో ఫార్మాసిటీ కాలనీలో 134 మంది (మేజర్ సన్స్)కి ఇళ్ల పట్టాలను వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి మంగళవారం అందజేశారు. దీర్ఘకాలిక సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో పరిష్కారం కావడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఏళ్ల నుంచి ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామన్నారు. తాను విశాఖ వచ్చిన ప్రతీసారి నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పదేపదే చెప్పేవారన్నారు. ఆయన చొరవతో గాజువాక హౌస్ కమిటీ సమస్య, ఏపీఐఐసీ నిర్వాసితులకు స్థలాల కేటాయింపు, కర్ణవానిపాలెం పునరావాసం, ఫార్మా నిర్వాసితుల మేజర్ సన్స్ పట్టాలు మంజూరు చేయించగలిమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారధ్యంలో ఇటువంటి ఎమ్మెల్యే ఉండడం నియోజకవర్గ ప్రజల అదృష్టమన్నారు. ఫార్మాసిటీ నిర్వాసితులకు ఉపాధి కల్పించేందుకు సంబంధిత యాజమాన్యాలతో చర్చిస్తామని వైవీ సుబ్బారెడ్డి హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో మూడు దశాబ్దాలుగా ప్రధానంగా నాలుగు సమస్యలు ఉండేవన్నారు. ఇప్పటికి ఐదు ప్రభుత్వాలు మారినా పరిష్కారం కాలేదని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి, పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ప్రత్యేక చొరవతో సమస్యలు పరిష్కారం కావడం గర్వంగా ఉందన్నారు. నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే 25వేల నిరుపేద కుటుంబాలకు పట్టాలిచ్చామని చెప్పారు. గతంలో హౌస్ కమిటీ పరిధిలో ఏడు వేల పట్టాలు టీడీపీ హయాంలో ఇచ్చిన పనికిరాకుండా పోవడంతో ముఖ్యమంత్రి జగన్ అన్ని హక్కులతో కూడిన పట్టాలిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్, మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తి రెడ్డి, పార్టీ నేతలు తిప్పల దేవన్‌రెడ్డి, వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, ప్రసాద్, పల్లా చినతల్లి, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, కార్పొరేటర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

మత్స్యకార భరోసా రూ.12.17 కోట్లు

జిల్లాలో 12,173 మందికి లబ్ధి



మత్స్యకారులకు చెక్కు అందజేస్తున్న డీఆర్‌వో శ్రీనివాస మూర్తి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్

మహారాణిపేట : వేట నిషేధ సమయంలో మత్స్యకార కుటుంబాలు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం వైఎస్సార్ మత్స్యకార భరోసా ద్వారా వారికి సాయం అందిస్తున్న విషయం తెలిసిందే. ఈ మేరకు మంగళవారం మత్స్యకారుల బ్యాంకు ఖాతాలో రూ.10 వేలు జమ చేశారు. బాపట్ల జిల్లా నిజాంపట్నంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభ నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 2023–24కు సంబంధించి ఐదో విడత సాయాన్ని మత్స్యకారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు.

విశాఖలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ వేట నిషేధ సమయంలో 12,173 మంది మత్స్యకార కుటుంబాలకు రూ.10 వేలు చొప్పున రూ.12.17 కోట్లు జీవన భృతి పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఆర్థికంగా ఆదుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి మత్స్యకారులంతా బాసటగా నిలవాలన్నారు. మత్స్యకారుల స్థితిగతులను మెరుగుపరిచేందుకు ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కూడిన 10 ఫిషింగ్ హార్బర్లు, 6 ఫిష్ లాండింగ్ కేంద్రాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని తెలిపారు.

జిల్లా రెవెన్యూ అధికారి ఎస్. శ్రీనివాసమూర్తి ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి జిల్లాలో మత్స్యకార భరోసా కింద రూ.12,17,30,000ల మెగా చెక్కును మత్స్యకారులకు అందజేశారు.

కార్యక్రమంలో ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ , జాయింట్ డైరెక్టర్ (ఫిషరీస్) విజయ, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా ఇంచార్జ్ పూర్ణిమ దేవి, ఫిషరీస్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పి.విజయ చంద్ర, మత్స్యకార సంఘాల నాయకులు బర్రి కొండబాబు, పలువురు మత్స్యకారులు పాల్గొన్నారు.

21న ఐఐటీ/నీట్ మెడికల్ అకాడమీల్లో ప్రవేశానికి పరీక్ష

కంచరపాలెం: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్షలో మెరిట్ ఆధారంగా.. ఐఐటీ/నీట్ మెడికల్ అకాడమీల్లో ప్రవేశాల నిమిత్తం ఈ నెల 21న నిర్వహించే రెండో దశ పరీక్షకు ఎంపికైన జాబితా http://apgpcet.apcfss.inలో అందుబాటులో ఉంది. ఈ మేరకు రాష్ట్ర సంక్షేమ గురుకుల కళాశాలల విశాఖ జిల్లా సమన్వయాధికారి ఎస్.రూపవతి ఓ ప్రకటనలో తెలిపారు. జాబితాలో పేర్లు ఉన్న అభ్యర్థులు రూ.100తో రిజిస్ట్రేషన్ పూర్తి చేసి, హాల్ టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈ నెల 21న జరిగే ప్రవేశ పరీక్షకు విశాఖ-అనకాపల్లి జిల్లాల నుంచి ఎంపికైన విద్యార్థులు మాత్రమే డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులం, శ్రీకృష్ణాపురం కేంద్రానికి హాజరుకావాలని ఆమె కోరారు. మరిన్ని వివరాలకు 0891-2799641లో సంప్రదించవచ్చు.

అధిక ఉష్ణోగ్రతలు.. అప్రమత్తత అవసరం

మహారాణిపేట: ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో కార్మికులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కార్మికశాఖ సంయుక్త కమిషనర్ ఎం.రామారావు సూచించారు. పరిశ్రమలు, నిర్మాణ రంగ సంస్థల యజమానులు కార్మికులకు తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు. పని గంటలు మార్పు చేయాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం కార్మికులకు పీస్ రేట్ ధరలు అందించాలని, పని ప్రాంగణంలో తాగునీటి సదుపాయం కల్పించాలని, అత్యవసర ఐస్ ప్యాక్ తదితరవి అందుబాటులో ఉంచాలన్నారు. ఆరోగ్యశాఖ సహకారంతో కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఇతర అవసరమైన మందులు అందించాలని సూచించారు.

నేటి నుంచి కామెడీ వర్క్‌షాప్

ఎంవీపీకాలనీ: బాల వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలలకు ఆటవిడుపుగా బుధవారం ఉచిత కామెడీ వర్క్‌షాపు ప్రారంభం కానుందని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నరవ ప్రకాశరావు ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులను చదువుతో పాటు ఇతర అంశాల్లోనూ ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ఎంవీపీ కాలనీలోని వీఎంసీ కళాశాలలో ఈ వర్క్‌షాప్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 17 నుంచి 19 వరకు ఈ వర్క్‌షాపు కొనసాగుతుందన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 92905 73289లో సంప్రదించాలని సూచించారు.

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	485.00
విజయనగరం	489.00
శ్రీకాకుళం	489.00

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.120
స్కిన్	: రూ.250
స్కిన్‌లెస్	: రూ.260

నూతన వేతనాల అమలు కోరుతూ ధర్నా

- స్టీల్‌ప్లాంట్ అడ్మిన్ బిల్డింగ్ ముట్టడిలో స్వల్ప ఉద్రిక్తత
- యాజమాన్యం ప్రకటనతో విరమణ


అడ్మిన్ గేటు వద్ద బైఠాయించిన కార్మికులు


పరిస్థితిని సమీక్షిస్తున్న ఏసీపీలు త్రినాథ్, పాల్ రాజు

ఉక్కునగరం: నూతన వేతనాల అమలు కోసం స్టీల్ ప్లాంట్ కార్మికులు చేపట్టిన అడ్మిన్ బిల్డింగ్ ముట్టడి స్వల్ప ఉద్రిక్తతకు దారి తీసింది. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సాగిన ధర్నాను యాజమాన్యం ప్రకటనతో విరమించారు. నూతన వేతనాల కోసం యువ కార్మికుల ఒత్తిడితో ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం తలపెట్టిన అడ్మిన్ ముట్టడి ఉదయం 8 గంటలకే ప్రారంభమైంది. యువ కార్మికులు పెద్ద ఎత్తున అడ్మిన్ కూడలికి చేరుకుని యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు చేరుకున్నారు. జనరల్ షిఫ్ట్ విధులకు అడ్మిన్ బిల్డింగ్, ప్లాంట్‌కు వెళ్తున్న ఉద్యోగులను అడ్డుకున్నారు. అక్కడ పెద్ద ఎత్తున పోలీసులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది మోహరించారు. పోలీసులు టౌన్‌షిప్ నుంచి వస్తున్న ఉద్యోగులను ప్రగతి మైదాన్ వైపు, కూర్మన్నపాలెం నుంచి వస్తున్న ఉద్యోగులను ప్రాజెక్ట్ ఆఫీసు వైపు మళ్లించారు. కార్మికులు అడ్మిన్ కూడలి వద్ద పెద్ద ఎత్తున బైఠాయించి నూతన వేతనాలు అమలు చేయాలంటూ నినాదాలు చేశారు.

అడ్మిన్ బిల్డింగ్‌లోకి వెళ్లేందుకు యత్నం

కొంతసేపటి తర్వాత కార్మికులు అడ్మిన్ బిల్డింగ్ ముందు ఏర్పాటు చేసిన బారికేడ్లను దాటి వెళ్లే ప్రయత్నంలో వారికి, పోలీసులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బారికేడ్లు దాటిన కార్మికులు అడ్మిన్ బిల్డింగ్ లోపలకు వెళ్లేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. పోలీసులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది వారిని అడ్డుకున్నారు. అడ్మిన్ బిల్డింగ్ గేటుకు తాళాలు వేసి ఉండటంతో.. అక్కడే కార్మికులు బైఠాయించి నినాదాలు చేశారు. ఏడీసీపీ ఆనందరెడ్డి పర్యవేక్షణలో సౌత్ ఏసీపీ టి.త్రినాథ్, హార్బర్ ఏసీపీ పాల్ రాజు నేతృత్వంలో సీఐలు వి. శ్రీనివాసరావు, ఎల్.భాస్కర్, రాము, ఉమామహేశ్వరరావు, పలువురు ఎస్ఐలు కార్మికులను నిలువరించడానికి ప్రయత్నించారు. కొంత మంది నాయకులు, కార్మికులను వాహనాల్లో స్టేషన్‌కు తరలించే ప్రయత్నం చేశారు. అలాగే కార్మిక సంఘ నాయకులు ప్రసంగిస్తుండగా.. వారిని యువ కార్మికులు అడ్డుకున్నారు. దీంతో వారి మధ్య స్వల్ప వివాదం చోటు చేసుకుంది. గాజువాక మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు రాజకీయ ప్రసంగం చేస్తుండగా కార్మికులు అడ్డుకున్నారు.

యువ కార్మికుల పట్టు

నూతన వేతనాల సాధన కోసం రాజకీయాలకు అతీతంగా యువ కార్మికులు చేస్తున్న ఆందోళనకు తలొగ్గి కార్మిక సంఘాలు ఈ కార్యక్రమం చేపట్టాయి. ఆందోళనలోనూ యువ కార్మికులు తలొగ్గక పోవడంతో యాజమాన్యం పట్టువీడింది. హెచ్ఆర్(ఐఆర్) జీఎం కె.సంజీవరావు వచ్చి ఈ సమస్యను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్తానని, ఈ నెలలో కార్మిక సంఘాలతో సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

పోరాటం ఆగదు

వేతన సవరణ చేసే వరకు పోరాటం ఆగదని కార్మిక సంఘ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరాం, కె.ఎస్.ఎన్.రావు, యు.రామస్వామి తదితరులు స్పష్టం చేశారు. ఈ అంశంపై యాజమాన్యంపై మరింత ఒత్తిడి తెస్తామని వెల్లడించారు.

అత్యున్నతమైనది గృహస్థాశ్రమ ధర్మం

ముగిసిన చాగంటి ప్రవచనాలు



మహారాణిపేట: సిరిపురం గురజాడ కళాక్షేత్రంలో ధర్మవర్ధిని ట్రస్ట్ ఆధ్వర్యంలో గృహస్థాశ్రమ వైభవం అనే అంశంపై బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా కార్యక్రమానికి విచ్చేసిన నగర ప్రజలనుద్దేశించి చాగంటి కోటేశ్వరరావు ప్రసంగిస్తూ.. మన భారతీయ సనాతన సంప్రదాయంలో భాగమైన గృహస్థాశ్రమ ధర్మానికి, వివాహ బంధానికి ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని గృహస్థాశ్రమ ధర్మంలో ఉన్న వారందరూ ధర్మాలు, నియమాలను పాటిస్తూ చక్కగా జీవించాలన్నారు. భార్యాభర్తలిద్దరూ భేద భావాలు, అరమరికలు లేకుండా అన్యోన్యంగా జీవించాలని, అప్పుడే ఆ దాంపత్య జీవితం ఆనందమయం అవుతుందన్నారు. ఈ జీవితం ఎంతో విలువైనదన్నారు. దీనిని ఆధ్యాత్మికంగా మలుచుకొని.. కుటుంబ సభ్యులందరినీ గౌరవించాలన్నారు. గృహస్థాశ్రమంలో మన పిల్లలకు మన సంప్రదాయాలు, మన ధర్మాల పట్ల అవగాహన కలిగించాలన్నారు. అప్పుడే వాళ్ల ధార్మిక జీవితాన్ని పొందగలుగుతారని చెప్పారు. మన ఇంటికి వచ్చిన అతిథిని విష్ణు స్వరూపంగా భావించి.. ప్రేమతో అన్నప్రసాదాన్ని పెట్టి ఆదరించినట్లయితే పరిపూర్ణమైన దైవానుగ్రహం కలుగుతుందన్నారు. మరో జన్మంటూ ఉంటే గృహస్థాశ్రమాన్ని కోరుకుంటానని, ఆదర్శ గృహస్థుడిగా జీవిస్తానని వివరించారు. కార్యక్రమంలో చాగంటి ధర్మపత్ని చాగంటి సుబ్రహ్మణ్యేశ్వరి, జి.శేషాచార్యస్వామి, అన్నంరాజు సత్యనారాయణ దంపతులు, ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, ధర్మవర్ధిని ట్రస్ట్ ప్రతినిధి చాగంటి చరణ్, చాగంటి సత్సంగ సభ్యులు నాగ సూర్యారావు, నారాయణ, ఎం.వి.ఎస్.ఎస్.మూర్తి, నగరానికి చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

యూఎల్‌సీ భూముల క్రమబద్ధీకరణ


మాట్లాడుతున్న జేసీ విశ్వనాథన్

మద్రిపాలెం: యూఎల్‌సీ భూముల క్రమబద్ధీకరణ రుసుంను ప్రభుత్వం తగ్గిస్తూ జీవో విడుదల చేసిందని, ఈ అవకాశాన్ని లబ్ధిదారులు వినియోగించుకోవాలని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ సూచించారు. జీవీఎంసీ 53వ వార్డు పరిధి మసీదు వీధి సచివాలయంలో మంగళవారం ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, గోపాలపట్నం తహసీల్దార్ కొర్ర జయతో కలిసి అర్బన్ ల్యాండ్ సీలింగ్(యూఎల్‌సీ) మిగులు భూములు 22ఏ-1డీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం విడుదల చేసిన కొత్త జీవో ప్రకారం 0 నుంచి 150 గజాల వరకు అర్హత కలిగిన అల్పాదాయ, అధిక ఆదాయ(బీపీఎల్, ఏపీఎల్) వర్గాలకు డీ-పట్టా ఇస్తామన్నారు. 150 నుంచి 300 చదరపు గజాల వరకు అధిక, అల్పాదాయ వర్గాలు ఎవరైనా స్థల విలువలో 15 శాతం రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. 300 నుంచి 500 గజాల వరకు ఉన్న స్థలాల్లోని నిర్మాణాలకు స్థల విలువలో 30 శాతం, 500 గజాలకు పైబడి ఉన్న స్థలాల్లో 100 శాతం రుసుం చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. లబ్ధిదారులు సమీపంలోని సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశం ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు ఉంటుందన్నారు. కార్పొరేటర్ బర్కత్ అలీ పాల్గొన్నారు.

యువత అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి భగవత్



మాట్లాడుతున్న మంత్రి భగవత్ కరద్

ఎంవీపీకాలనీ (విశాఖ): దేశ యువత అభ్యున్నతే బీజేపీ ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి డాక్టర్ భగవత్ కిషన్‌రావ్ కరద్ అన్నారు. 5వ విడత ప్రధాన మంత్రి రోజ్‌గార్ మేళా కార్యక్రమంలో పాల్గొనేందుకు విశాఖ వచ్చిన ఆయన మంగళవారం లాసన్స్‌బే కాలనీలోని బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. దేశ వ్యాప్తంగా 45 ప్రాంతాల్లో 5వ విడత రోజ్‌గార్ మేళా జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా 71 వేల మంది యువతకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేసినట్లు తెలిపారు. దేశంలో యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం సేవలందిస్తుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ సెక్టార్లలో పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రధాని జన్‌ధన్ యోజన, ప్రధాని ఆవాస్ యోజన, స్వానిధి యోజన, అటల్ పెన్షన్ యోజన, ప్రధాని సురక్షా యోజన వంటి పథకాలను లబ్ధిదారులైన రాష్ట్ర ప్రజలు పెద్ద ఎత్తున వినియోగించుకోవాలని సూచించారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్ రాజు, సేల్ డైరెక్టర్ కాశీ విశ్వనాథరాజు, సుహాసిని ఆనంద్, మేడపాటి రవీంద్ర, ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశాఖకే తలమానికంగా ఏయూ

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం అఖిల భారతస్థాయిలో అత్యుత్తమ ర్యాంక్ సాధించడంపై మేయర్ గొలగాని హరివెంకట కుమారి సంతోషం వ్యక్తం చేశారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డిని మంగళవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఏయూలో నాలుగేళ్లుగా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను తాను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నట్లు చెప్పారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఏయూను అభివృద్ధి చేస్తున్న విధానం ఆదర్శనీయమన్నారు.

ఏయూ జాతీయస్థాయిలో ర్యాంక్ సాధించడంపై వర్సిటీ అనుబంధ బీఈడీ కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకులు ఆనందం వ్యక్తం చేశారు. వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్‌లను కార్యాలయంలో కలసి శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ మోహన్, ఉపాధ్యక్షుడు డాక్టర్ కె.అప్పలనాయుడు, సభ్యులు మంగేష్, పలు కళాశాలల ప్రిన్సిపాళ్లు, కరస్పాండెంట్‌లు పాల్గొన్నారు.

డెంగ్యూపై అవగాహన ర్యాలీ

మహారాణిపేట: జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ జరిగింది. జబ్బరితోట పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో పైన్‌డొరపేట కల్యాణ మండపం వద్ద మొదలైన ర్యాలీని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. కల్యాణ మండపం చుట్టు పక్కల ప్రాంతాల్లో జరిగిన ర్యాలీలో మలేరియా సిబ్బంది, వార్డు ఆరోగ్య కార్యదర్శులు, ఆశ కార్యకర్తలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఇల్లు, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని కోరారు. డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతీ శుక్రవారం డ్రై డేను పాటించాలని కోరారు. కార్యక్రమంలో మలేరియా విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ కె.వి.ఎస్.ప్రసాద్, జిల్లా మలేరియా అధికారి మణి, సబ్ యూనిట్ అధికారి నగేష్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్ల రీషెడ్యూల్

తాటిచెట్లపాలెం: ఆయా స్టేషన్లకు పలు రైళ్లు ఆలస్యంగా చేరుకుంటున్న నేపథ్యంలో.. పలు స్టేషన్లలో బయలుదేరుతున్న రైళ్లను రీషెడ్యూల్ చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఆయా స్టేషన్లలో బయలుదేరిన సమయాన్ని బట్టి ఈ రైళ్లు అంతే ఆలస్యంగా స్టేషన్లకు చేరుకోనున్నాయి.

- ఎం.విశ్వేశ్వరయ్య టెర్మినల్ బెంగళూరు-హౌరా(12864) ఎక్స్‌ప్రెస్ సుమారు 1.15 గంటల ఆలస్యంగా మంగళవారం ఉదయం 11.50 గంటలకు బెంగళూరులో బయలుదేరింది.
- హౌరా-ఎం.విశ్వేశ్వరయ్య టెర్మినల్ బెంగళూరు(22887) హంసఫర్ ఎక్స్‌ప్రెస్ సుమారు రెండు గంటలు ఆలస్యంగా మంగళవారం మధ్యాహ్నం 2.40 గంటలకు హౌరాలో బయలుదేరింది.
- విశాఖపట్నం-కోర్బా(18518) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ 2.25 గంటలు ఆలస్యంగా మంగళవారం రాత్రి 11.30 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరింది.

పారిశుధ్య నిర్వహణ బాధ్యత మీదే..

శానిటేషన్ కార్యదర్శులకు జీవీఎంసీ కమిషనర్ ఆదేశం


మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్

బీచ్‌రోడ్డు: పారిశుధ్య నిర్వహణ బాధ్యత సచివాలయ శానిటరీ కార్యదర్శులదేనని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ స్పష్టం చేశారు. సిరిపురంలోని చిల్డ్రన్ ఎరీనాలో మంగళవారం శానిటేషన్ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శానిటేషన్ కార్యదర్శులందరూ ఉదయం 5.30 గంటల నుంచి విధుల్లో ఉండాలన్నారు. నగరాన్ని డస్ట్ బిన్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దేందుకు మీ అందరి కృషి అవసరమన్నారు. నగరంలోని ప్రతి దుకాణం ముందు డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసుకునే విధంగా యజమానులకు అవగాహన కల్పించడంతో పాటు చెత్తను జీవీఎంసీ వాహనానికి అందించేలా చూడాలన్నారు. వార్డులో పందులు నియంత్రణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. షూటర్లతో వాటిని సమూలంగా నిర్మూలించాలన్నారు. ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. సచివాలయాల పరిధిలో భవన నిర్మాణ వ్యర్థాలు ఉన్నట్లయితే ప్లానింగ్ కార్యదర్శులతో మాట్లాడి వాటిని తొలగించాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం యూజర్ చార్జీల వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఆదేశించారు. వచ్చే వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని ప్రధాన గెడ్డలతో పాటు మైనర్ గెడ్డల్లోని పూడికలు తీయించాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా ప్రతీ శుక్రవారం డ్రై డే నిర్వహించడంతో పాటు సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియాపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజా మరుగుదొడ్లతో పాటు కమ్యూనిటీ మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అదనపు కమిషనర్ వి.సన్యాసిరావు, జెడ్సీలు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుడి అదృశ్యం


అప్పలరాజు (ఫైల్)

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్‌కు చెందిన కాంట్రాక్ట్ కార్మికుడు సోమవారం మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదు. దీనిపై స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలివీ.. స్టీల్‌ప్లాంట్ బీఎఫ్ విభాగంలో బి.కె.ఎంటర్‌ప్రైజెస్ సంస్థ కాంట్రాక్ట్ పనులు చేస్తోంది. ఈ సంస్థలో పనిచేస్తున్న వనమాడ అప్పలరాజు (50) సోమవారం ఉదయం జనరల్ షిఫ్ట్ విధులకు వెళ్లాడు. మధ్యాహ్నం అతని సూపర్‌వైజర్ అప్పలరాజును బీఎఫ్-1 సేఫ్టీ కన్వేయర్ వద్దకు వెళ్లమన్నారు. ప్రస్తుతం తాను వెళ్లలేనని చెప్పడంతో రెండు గంటల విశ్రాంతి తర్వాత వెళ్లాలని సూచించారు. అయితే ఆ తర్వాత అప్పలరాజు పనిలోకి వెళ్లలేదు. సాయంత్రం ఇంటికీ చేరలేదు. ఈ విషయాన్ని ఆయన భార్య.. తన అన్నయ్య, ఎస్ఎంఎస్ విభాగం కాంట్రాక్ట్ కార్మికుడు యరబాల అశోక్‌కుమార్‌కు తెలిపింది. వెంటనే బీఎఫ్ విభాగంతో పాటు చుట్టుపక్కల వెతికారు. ఆయన ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం స్టీల్‌ప్లాంట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

జీవీఎంసీ బడిలో ఉపాధ్యాయుడి పిల్లలు


సంతపేటలో ఇంటింటా అడ్మిషన్ల ప్రక్రియలో పాల్గొన్న అంబేడ్కర్ పాఠశాల ఉపాధ్యాయులు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు అంబేడ్కర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న గాదం దుర్గాప్రసాద్ తన ఇద్దరు పిల్లలను అదే స్కూల్‌లో చేర్పించారు. గత విద్యా సంవత్సరంలో పెద్ద కుమార్తె దుర్గా మహిమశ్రీని చేర్పించగా ఆమె ప్రస్తుతం రెండో తరగతికి వచ్చింది. మంగళవారం ప్రధానోపాధ్యాయురాలు మొకర పద్మావతి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు గాదం దుర్గాప్రసాద్, డీవీ రమేష్, వై.వెంకటేష్, మణి, జె.ఇందిర, జె.శివజ్యోతి జగనన్న బడిబాట కార్యక్రమంలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్ రెండో కుమార్తె తన్విక్‌శ్రీను ఒకటో తరగతిలో చేర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడిని పలువురు అభినందించారు.

ఈతకు దిగిన యువకుడి గల్లంతు

పీఎంపాలెం: ఆఖరు బస్టాప్ నుంచి శంభువానిపాలేనికి వెళ్లే రోడ్డులోని తుమ్మిరిగెడ్డ మినీ రిజర్వాయర్‌లో ఈతకు దిగిన ఓ యువకుడు గల్లంతయ్యాడు. పీఎంపాలెం స్టేషన్ ఎస్ఐ సోమరాజు తెలిపిన వివరాలివీ.. పీఎంపాలెం ముస్లిం కాలనీకి చెందిన షేక్ చినసాహెబ్(32) మరో నలుగురితో కలసి మంగళవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో తుమిరిగెడ్డలో స్నానం చేయడానికి దిగాడు. రిజర్వాయర్‌లో ఈదుకుంటూ చిన సాహెబ్ కొంత దూరం వెళ్లి కనుమరుగయ్యాడు. అతనితో వెళ్లిన వారు పిలిచినా సమాధానం రాలేదు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో పీఎంపాలెం పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ సోమరాజు ఆధ్వర్యంలో రిజర్వాయర్‌లో గాలింపు చర్యలు చేపట్టారు.